


# నిజం




అతని ఛాతీపైన ఆమె తల.

ప్రేమగా ఆమె తల నిమురుతున్న అతని కుడిచేయి.

"ఏమండీ."

"ఊఁ"

"నేనొక మాట చెబుతాను — మీరు కోప్పడనంటే, బాధపడనంటే "

"సుశీ! నువ్వేం చెప్పినా వింటాను ఏం చెయ్యమన్నా సంతోషంగా చేస్తాను."

"ఈ జబ్బు చేసిన దగ్గర్నించీ నా కెందుకో అనుమానంగా వుందండీ-కాదు నమ్మకంగానే వుంది - నేనిక ఎంతో కాలం బ్రతకనని. ఒక్క సంవత్సరం ముందు చావంటే భయంలేదు నాకు. మీతో పెళ్ళి అయి ఈ ఏడాది పాటూ మీ ప్రేమానురాగాలు అనుభవించాక నాకు కొన్ని వేల సంవత్సరాలు బ్రతకాలనుంది మీతో. కాని ఏం లాభం? వెళ్ళిపోతున్నాను." ఓపిక లేని ఆమె నిట్టూర్పు.

ఆమె పెదాలపై నిలువుగా అతని చూపుడు వేలు.

అతని చూపుల్లో ఏదో వేదన. అలా మాట్లాడవద్దని ప్రార్థన. వేడుకుంటున్నట్లున్న ఆకళ్ళల్లో భావాలు.

"దయచేసి అట్లాంటి మాటలొద్దు సుశీ."

"ఏఁవిటో మీ పిచ్చిగాని నేను మాట్లాడటం మానేసినంత మాత్రాన నిజం దాగుతుందా? జరిగేది ఎక్కడైనా ఆగుతుందా?"

"అదంతా నిరాశ. నిస్పృహ. జరగబోయేది నీకేం తెల్సు?"

"కాదండీ! నాకు తెలుస్తోంది-ఇంకెన్నాళ్ళో బ్రతకనని. నాకు జ్యోతిష్యం తెలియదు. ఓరకమైన ఆశ్చర్యంతప్ప అదంటే నమ్మకమూ లేదు. సిక్త్ సెన్స్ నాకుందనుకోను. కారణం కరెక్టుగా చెప్పలేనుగాని మొత్తం మీద...."

"సుశీ! నువ్వెందుకిలా బెంబేలుపడిపోతున్నావో నాకర్థం కావటంలేదు. ఇంత దూరాన వున్న రాయ్‌వెల్లూర్ హాస్పిటల్ కొచ్చింది నీ ప్రాణాన్నిచ్చి వెళ్ళటానికి కాదు."

"మీదంతా ఆశావాదం. ఇక్కడేమన్నా దేవతలున్నారా? లేక ప్రాణాలు ఎక్కిస్తారా నరాల్లోకి? ఖరీదైన మెషీన్స్. కాస్త విదేశపు మందులు, దీక్షతో పనిచేసే డాక్టర్లు వుండొచ్చు యిక్కడ. కాని ప్రాణం పోయేప్పుడివన్నీ వేస్! అప్పుడు నిలబడి చూడాల్సిందే వీళ్ళూ. వీళ్ళ పొడుగాటి డిగ్రీలూ!!"

అతని చేయి ఆమె తలని ప్రేమగా నిమురుతోనే వుంది.

"నాకు తెల్సు సుశీ! మంచంపట్టినప్పుడెంత ధైర్యశాలికయినా మనసు చిక్కిపోతుంది. శరీరంకంటే ఎక్కువగా ఎండిపోతుంది. అప్పుడేగా సరికాస్త ధైర్యంగా వుండాల్సింది. జబ్బుచేసిన వాళ్ళల్లా చనిపోతే ఈ లోకం యిన్నాళ్ళు యిలా వుండదు సుశీ. మనిషన్నాక, జీవంవున్నాక అప్పుడప్పుడూ సుస్తీ చేయకుండా వుంటుందా? తగ్గకపోతుందా?"

ఆమె పెదాలు అడ్డంగా సాగాయి. అప్పటికదే నవ్వు.

"ఏఁవండీ, మీరు ఇంజనీరు కాకుండా డాక్టర్ అయివుంటే బావుండేది. మీరిచ్చే భరోసాతోనే రోగాలు తగ్గిపోను సగం మంది రోగులకి! చేయి అందించినా, తాడు విసిరినా అందుకోలేని స్థితి నాది. ఒడ్డుపై పూర్తిగా ఆశ వొదులుకున్న దాన్ని. నా బాధల్లా నేను చనిపోతే మీరు పిచ్చివారయిపోతారని; నన్నింత ప్రేమించే మీరు నేను లేక బ్రతకలేరని "

"నువ్వు బ్రతికే వుంటావ్ సుశీ! మన డాక్టర్‌గారు రాయవెల్లూర్ తీసికెళ్తే మంచిదన్న దగ్గర్నుంచీ యిలాగే మాట్లాడుతున్నావ్. మంచి వైద్యం జరుగుతుందనీ. ఖర్చు పెట్టగల స్తోమత మన కుందనీ సంపించారుగాని ఆశ వొదులుకునికాదు; ఆయన చేతులు కడుక్కోవటానికీకాదు."

చేతి వాచీ వంక చూసి, లేచి డ్రాయర్ లోంచి సీసాతీసి, ఓ కేప్స్యూల్ తెచ్చి ఆమె చేత మింగించాడు.

అతని కళ్ళల్లోకి చూస్తూ. ఆమె కళ్ల ఎందుకో దేనికోసమో వెదుకులాట.

"ఏమండీ మన పెళ్ళయి ఒక్క ఏడాదే అయినా ఎన్నో జన్మలనుంచి కాపురం చేస్తున్నంత దగ్గరయ్యాంకదూ?"

ఆమె మాటల్లో కొండంత తృప్తి.

అవునండి అతని తల నిలువుగా వూగుతూ.

"ఎందుకింతగా కల్సిపోయాం?" మళ్ళీ ఆమే.

"ప్రతీదానికి కారణం వుండితీరాలా?"

"ఏఁవండీ, మన యిద్దరి బంధం తల్చుకుంటే నా కెంత గర్వంగా వుంటుందో తెలుసా? ఎంత సంతోషంగా వుంటుందో తెలుసా?"

"ఎంత?"

అతని ప్రశ్న అతి క్లిష్టమైనది. ఆమె తెలివైనది.

"ఎంతో....! చెప్పలేనంత!" కాస్త ఆలస్యం అయినా ఆమె సమాధానం సాటిలేనిది. దానికి తోడుగా ఆమె ముఖం మీద నాట్యం చేసిన చిరునవ్వులో బలం లేకపోయినా జీవం వుంది.

"మన పెళ్ళి-పెళ్ళి చూపులనాటి నుంచి యిప్పటి వరకూ మీతో గడిపిన క్షణాలన్నీ కంఠస్థమేనండీ నాకు. మీరంటే అంత ప్రేమ కాబట్టే చనిపోవాలంటే బాధగా వుంది, నన్నింత ప్రేమించే మీరేం అయిపోతారోనని బెంగగా వుంది. స్వర్గానికెళ్ళినా మీరు లేనప్పుడది నరకమే నాకు."

అతని చేయి ఆమె చెక్కిలి మీద కన్నీళ్ళు తుడుస్తూ.

"నేనూ అంతేకదా సుశీ. నేను మాత్రం బ్రతగ్గలనా నువ్వు లేకుండా. బ్రతికినా చనిపోయినా నీతోనే. నువ్వు లేనప్పుడిక నాకీ లోకంలో ఏఁవుంది చెప్పు? ఒక్క క్షణం అయినా నిన్ను విడిచి బ్రతకలేనివాడ్ని నిన్ను మర్చిపోయి బ్రతగలనా? నేను మొక్కే కోటి దేవుళ్ళలో ఒక్కరయినా కాపాడరా నా సుశీని? నువ్వు లేని నేను లేను సుశీ. నా కోసం అయినా నువ్వు బ్రతికి తీరాలి."

మరి ఆపైన అతనికి మాటలు రాలేదు.

నాకూ బతకాలనే వుందండి కాని దేవుడి పిలుపుని కాదనే శక్తి మనకి లేదుగా. చనిపోయినా ఆ లోకంలో ఎదురు చూసోనే వుంటాను మీ స్మృతుల్లోనే బతుకుతుంది నా ఆత్మ. అలానే ఎదురుచూస్తోంటుంది మీ కోసం. నా కొక్కటే ఎక్కువగా బాధండీ "

ఏమిటన్నాయి అతని కళ్ళు గొంతులో చేరిన కన్నీళ్ళు మాట్లాడే శక్తిని హరించాయ్.

"మిమ్మల్ని దగాచేసి, ఏకాకిని చేసి వదిలిపోతున్నందుకు కనీసం ఓ పాపనో, బాబునో యిచ్చి వుంటే కొంత నయం మీరెం ఆశపెట్టుకుని బ్రతుకుతారు నేను పోయాక? ఎన్నేళ్ళు అలా మోడు బ్రతుకు. మీ గురించే నా బాధ."

"సుశీ నువ్వు ఎక్కువగా మాట్లాడకు. లేని పోని అనుమానాలతో మనసు పాడు చేసుకుంటే కోలుకోవడం ఆలస్యం అవుతుంది మనో వ్యాధిని ప్రోత్సహిస్తే అసలు రోగంకంటే ఎక్కువదెబ్బతీసుంది. అన్నీ సవ్యంగా జరుగుతాయి. కొద్దిరోజుల్లోనే యింటికివెళ్ళి హాయిగా వుంటాం మళ్ళీ. పడుకో నువ్వు."

"ఓ వేళ చనిపోతే ?"

"నేనూ వస్తాను నీతో. నువ్వులేని ఈ లోకంతో నాకు పనిలేదు. ఆ లోకంలోనే వుందాం కల్సి. సుశీ, నువ్వు నా ఆరో ప్రాణం."

దుప్పటి కప్పి, నుదురుపై చుంబించాడు ప్రేమగా. లైట్ ఆఫ్ చేసి, ఆమె మంచం ప్రక్కనున్న పడక కుర్చీలో నడుం వాల్చాడు

అలిసిపోయిన అతను గాఢనిద్రలోకి జారుకోవడం సహజం. ఎప్పుడు పోయిందో ప్రాణం, మర్నాటి వుదయం అతను లేచేసరికి ఆమె కంటిలో కదలిక లేదు చెప్పి మరీ చనిపోతారు కొంత మంది- వాళ్ళకి ముందే తెల్సినట్లు.

"సుశీ ! నేను ద్రోహిని ! వంచకుడిని ! మోసగాడిని !...."

"ఏవండీ ! ఏమిటి కలవరిస్తున్నారు ? నిద్ర సరిగాపట్టటంలేదా ?"

అన్నది అతని ఆరో ప్రాణం - సుశీ కాదు. ఆమె చనిపోయిన ఆర్నెల్లకే ఆమె స్థానాన్నలంకరించిన అతని రెండో భార్య నిర్మల. అతనితో గత ఐదు సంవత్సరాలుగా కాపురం చేస్తూ, ఓ బాబును. ఓ పాపను కన్న అతని 'మరో' ఆరో ప్రాణం ! !

"ఏం లేదు పడుకో."

అటు తిరిగి పడుకున్న అతని మనసులో ఎన్నో భావాలు చెలరేగేయి.

'అమ్మో ! అలా జరిగితే భరించగలనా?' అనుకుంటాడు మనిషి జరిగేక చేసేదేముంది? తల వంచటం, అనుభవించటం తప్ప ! ఈ ప్రేమ కబుర్లంత మాయాజాలం మరోటి వుంటుందా అసలు? దానికి నిదర్శనం నా బ్రతుకేగా నా సుశీకి చెప్పిన మాటలన్నీ నీటిమూటలేగా. అంత నచ్చి అబద్ధాలు యింకెక్కడన్నా వుంటాయా ?

"తెల్లచీర కట్టుకుని. బొట్టు చెరిపేసుకున్నా బ్రతుకుతూనే వుంది భర్తపోయిన ఆడది ఆయన లేని ఈ బ్రతుకు నా కెందుకు అంటూనే అనుకుంటూనే. భార్యపోయిన మర్నాటినుంచే పెళ్ళి చూపులకి బయల్దేరుతున్నాడు - నువ్వు నా ఆరో ప్రాణం. నువ్వు చనిపోతే పిచ్చివాడ్నయిపోతా, నీతోకూడా వొచ్చేస్తా అన్న మగవాడు !! బతికి వుండటం తప్పుకాదు ఆ గాలి కబుర్లే తప్పు. అంతా పిచ్చిగాని ఈ మాయాలోకంలో ఒకరు లేకపోతే చక్రం తిరగటం ఆగిపోతుందా ?! ఆత్మ, జన్మ, దేవుడు, స్వర్గం, నరకం, యివన్నీ వుత్త బూటకాలు. వీటికంటే నీటి మూటలు వెయ్యిరెట్లు నయం. భార్యా భర్తలంటే బ్రతికినన్నాళ్లూ ఒకరి కొకరు తోడూ. నీడా తప్ప యింకేం కాదని ఎవ్వరికీ అర్థం కాదేం ?...."

అతని మనసు అన్ని నిజాలు తెల్పుకున్నా, కన్నీరు కారుతూనే వుంది తెల్లవార్లూ. ఉదయానికల్లా తలగడ తడిసిందేగాని అన్నీ తెల్సినా ఎందుకేడుస్తున్నాడో అతనికీ అర్థంకాలేదు.

